

# పుస్తక పరిచయం

**కోడీహళ్ళి మురళీమోహన్‌గారు, కస్తూరి మురళీకృష్ణగారు** – తెలుగు కథానికా ప్రపంచంలో వినూత్నమైన, విభిన్నమైన కథాసంకలనాలను ప్రచురిస్తున్నారు. వారి ప్రయత్నం ఒక అద్భుతమైన ఉద్యమంలా కొనసాగుతోందనడంలో ఏ మాత్రం అతిశయోక్తిలేదు. తెలుగు సాహిత్యంలో ఇలాంటి ప్రయత్నం ఇంతకుముందు జరిగిన దాఖలాలు కనిపించడం లేదు – ఇంతవరకూ వీరు వెలువరించిన కథాసంకలనాలను గమనిస్తే ఈ అంశం స్పష్టంగా తెలుస్తుంది. అవి – రైలు కథలు, దేశభక్తి కథలు, తెలుగు కథల్లో గాంధీ మహాత్ముడు, ఇప్పుడు వెలువడింది ఈ క్రీడాకథలు. ఇలా ఒకే కథాంశంతో వచ్చిన కథలన్నింటినీ ఒకచోట చేర్చడమే కాక, ఆయా కథల ఎంపికలో కూడా వీరిరువురూ చేసిన కృషి కొట్టవచ్చినట్లుగా కనిపిస్తుంది. 'సంచిక' వెబ్‌పత్రికకు అనుబంధంగా వెలువడిన ఈ క్రీడా కథల సంకలనం విషయానికే వస్తే – ఇందులోని కథలన్నింటిలో కథాంశం 'ఆటలు' ఐనా మళ్ళీ వాటిల్లో కూడా ఆట మాత్రమే ఆత్మగా ఉండే కథలనే ఎంచుకున్నారు. అంటే ఆటను ఊతకర్రగా చేసుకుని ఎన్నెన్నో సామాజిక అంశాలనో, జీవన సత్యాలనో చెప్పే కథలను ఇందులో చేర్చలేదు. కథ అంతా 'ఆట' చుట్టూనే తిరిగేలా ఉండే కథాంశాలనే ఎంపికచేసుకున్నారు. వీటిల్లో ఏడెనిమిది దశాబ్దాల క్రిందటి కథలనుంచీ ఇటీవల వచ్చిన కథలవరకూ క్రీడాస్ఫూర్తితో సాగే వాటిని గుదిగుచ్చి మనకు అందించారు. సంపాదక వర్గం చేర్చిన 'అదనపు విలువ' – ఈ కథల ఎంపిక నుంచి, వాటిని వర్గీకరించడం, నేపథ్యంలో జరిగిన కృషిని వివరించడం.. ప్రతి పేజీలోనూ కనిపిస్తుంది. ఏ క్రీడ ఐనా ఆడేది ఆటే అనిపించినా ఆట ఆడడంలో అనేక కోణాలు ఉంటాయన్న విషయాన్ని ప్రధాన ప్రాతిపదికగా తీసుకుని ఈ కథలను విభాగాలుగా అమర్చిన తీరు అభినందనీయం. నాంది, ప్రస్తావన, క్రీడాస్ఫూర్తి, క్రీడా మానసికం, క్రీడా వినోదం. క్రీడోన్మాదం. క్రీడ-నేరం – ఈ విభాగాల్లో 23 కథలు మనలను అలరిస్తాయి, ఆలోచింపచేస్తాయి, ఆలోచనల్లో మిగులుతాయి. రచయితల విషయానికి వస్తే – ప్రముఖుల రచనలూ ఉన్నాయి, అప్పుడప్పుడు కనిపించే రచయితల రచనలూ ఉన్నాయి, అరుదుగా అగుపించే రచయితల కథలూ ఉన్నాయి. -తద్వారా రచయితకున్న ప్రాచుర్యానికి కాక కథల్లోనే నాణ్యతకే పెద్దపీట వేశారన్న సంగతి స్పష్టమౌతుంది. వివిధ క్రీడలే కాక ఒక్కో క్రీడలోనూ ఉండే వివిధకోణాలు, ఆటగాళ్ళ లోని వివిధ కోణాలూ కూడా ఈ కథల్లో ప్రతిబింబిస్తాయి. ఆట ఆడడం అనేది క్రీడాస్థలికే పరిమితం కాదు, చాలాసార్లు ఆటే జీవితమనిపిస్తుంది, గెలుపుబాటలో సాగినంతకాలం వెలుగుపూలు విరజిమ్ముతుంటాయి, వెలుగులు కనుమరుగునైప్పుడు ఇంకెన్నో నీడలు ఆవరించుకుంటాయి. ఇలాంటి అనేకానేక అంశాలను అద్భుతంగా పొదిగిన, ఏర్చికూర్చిన ఈ క్రీడాకథా కుసుమాలను కథాప్రియులందరూ చదివి ఆస్వాదించాలి. ★★★




ప్రచురణ
సాహితి ప్రచురణలు
33-22-2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్.రోడ్, చుట్టగుంట, విజయవాడ
ఫోన్: 0866- 2436642/43, 8121098500
Email: sahithi.vja@gmail.com






**తెలుగు సాహిత్యాభిమానులకు** ‘రచన‘ మాసపత్రికను కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు, ముఖ్యంగా కౌముది పాఠకులకూ. 1991 డిసెంబర్‌లో ప్రారంభమైన ‘రచన‘ మాసపత్రిక - ఉన్నతమైన విలువలున్న రచనలకు, నిబద్ధతగల శీర్షికలకూ పెట్టింది పేరు అన్న విషయమూ అందరికీ తెలిసిందే. ఈ పత్రికను గత పాతికేళ్ళు పైగా నడుపుతున్న ‘రచన శాయి‘ గా అందరికీ తెలిసిన వై.ఎస్.ఎస్. ఆర్.ఎస్.శాయిగారు ఏకవ్యక్తిసేన. పత్రికా నిర్వహణ అనేది వ్యాపారసంస్థలకు తప్ప ఒంటరి వ్యక్తులకు సరిపడదు, సాధ్యపడదు అనుకుని మంచిపత్రికలన్నీ మూతపడుతున్న 1990 ప్రాంతాల్లో ‘రచన‘ మాసపత్రికను విశాఖపట్నం నుంచి ప్రారంభించడంలోనే శాయిగారి పట్టుదల తెలుస్తుంది. అదే పట్టుదలతో, గత పాతికేళ్ళుగా, రచన పత్రికను నమ్ముకున్న విలువలకు రాజీ పడకుండా నడపడం శాయిగారికి మాత్రమే సాధ్యపడుతోంది. మధ్యమధ్యలో ఎన్ని ఆటంకాలు, ఆటుపోట్లు ఎదురైనా ఈ పత్రికానిర్వహణను దీక్షతో ఒక తపస్సులా కొనసాగించడం శాయిగారికే చెల్లింది. ఏమాత్రం వ్యాపారపరమైన కోణాలు లేకుండా పూర్తిగా సాహిత్యపరమైన శీర్షికలతోనే పత్రికను నడపడం  కత్తిమీద సామే అన్న విషయం తెలిసీ ఆ సాహసాన్ని పాతికేళ్ళుగా కొనసాగిస్తున్న శాయిగారికి తెలుగుపాఠకలోకం ఎంతైనా ఋణపడిఉంది. అదే క్రమంలో ఇప్పుడు శాయిగారు రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటిని ‘నభూతో నభవిష్యతి‘ అన్న రీతిలో ఆరు సంపుటాలుగా తీసుకొచ్చారు. తెలుగు పత్రికా ప్రపంచంలో ఇటువంటి ప్రయోగం ఇంతవరకూ జరగలేదని నిస్సంశయంగా చెప్పొచ్చు. ఒక పత్రిక పాతికేళ్ళ ప్రయాణంలో ఎన్నో మజిలీలు, మలుపులు, తీపిగురుతులు - వీటన్నింటినీ అత్యంత సుందరంగా ముద్రించి మనకి అందించారు. ఒక్కో సంపుటీ సుమారుగా 500 పేజీల చొప్పున మొత్తం మూడు వేల పేజీల బృహత్సంకలనం ఇది. ఈ సంపుటాల్లోని ప్రతి పేజీలోనూ శాయిగారి కృషి స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సంపుటాల్లో కథలూ, శీర్షికలూ, కవితలూ, వ్యాసాలూ, ప్రత్యేక రచనలు, అలనాటి మధుర స్మృతులూ - అనేకం చోటుచేసుకున్నాయి. మొట్టమొదటి సంపుటి మొదట్లోనే రచన ప్రారంభం గురించి, తెరవెనుక కథనాలు అత్యంత ఆసక్తికరంగా వివరించారు.  ఈ సంపుటాల్లో ఎవరెవరి రచనలున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు - తెలుగు సాహిత్యంలో ఫలానా అని పేర్కొనదగిన వారందరి రచనలూ ఉన్నాయి. ప్రతి సంచికలోని వర్ణచిత్రాలు - ముఖ్యంగా అలనాటి గృహలక్ష్మి మాసపత్రిక ముఖచిత్రాలు అత్యంత విలువైన సేకరణలు. అన్ని సంపుటాలు కలిసి ఆరు కేజీలపైగా బరువున్న ఈ సంపుటాల్లోని అనేక రచనలను అరుదైనవాటిలో అరుదైనవిగా పేర్కొనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ సంపుటాలను సొంతం చేసుకోవడం తెలుగు పాఠకుడికి ఒక ప్రతిష్ఠాత్మకమైన గౌరవం. ఈ సాహసకార్యక్రమానికి కర్త, కర్మ, క్రియ అంతా తానే ఐన రచన శాయిగారిని ఎంత అభినందించినా సరిపోదు..!

★★★

*For Copies*

**1-9-286/2/P – Yadlapati House**
**Vidyanagar(Near Ramnagar Gundu)**
**HYDERABAD – 500 044**
**Phone: 040-2707 1500**
**rachanapatrika@gmail.com**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**